యూపీఏ, ఎన్డీయేలు.. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేకపోయాయిః రాహుల్ గాంధీ

ఢిల్లీః దేశంలో నిరుద్యోగ సమస్యకు యూపీఏ, ఎన్డీయే ప్రభుత్వాలు సరైన పరిష్కారం చూపించలేకపోయాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఉత్పత్తి ఆధారిత దేశంగా మనం విఫలమై.. దానిని చైనాకు అప్పగించామన్నారు. ఇకనైనా మనం ఉత్పత్తి పైనే పూర్తిగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. 'మేకిన్ ఇండియా' మంచి ఆలోచనే అయినప్పటికీ దానిని అమలు చేయడంలో మోదీ విఫలమయ్యారని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా మాట్లాడిన రాహుల్.. ఆ ప్రసంగంలోని అంశాలు ఏటా ఒకేలా ఉంటున్నాయని వ్యాఖ్యానించారు. ''యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉంది. మనం మాట్లాడేది ఏదైనా వారి గురించే అయి ఉండాలి. మనదేశం అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. నిరుద్యోగ సమస్యను పరిష్కరించలేకపోయాం. గతంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ఎన్డీయేలు ఉపాధి ఉపాధి కల్పన గురించి దేశ యువతకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోయాయి. 'మేకిన్ ఇండియా' ఆలోచన మంచిదే. కానీ దీనిలో ప్రధాని మోదీ విఫలమయ్యారు. ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోకపోవడం వల్ల చైనా ఇక్కడ మకాం వేసింది. తయారీలో మనం విఫలమై, చైనాకు అప్పగించాం. ఇప్పటికైనా తయారీపైనే పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది. దేశంలో సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

హిందూపురం మున్సిపాలిటీ టీడీపీ కైవసం

విశ్వంభర, హిందూపురం: హిందూపురం మున్సిపాలిటీని తెదేపా కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్‌గా ఆరో వార్డు కౌన్సిలర్ రమేశ్ ఎన్నికయ్యారు. ఆయనకు 23 ఓట్లు పోలయ్యాయి. ఓటింగ్‌లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎంపీ పార్థసారథి పాల్గొన్నారు. 40 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో 23 మంది మద్దతు పలకడంతో మున్సిపల్ ఛైర్మన్‌గా రమేశ్ ఎన్నికయ్యారు. వైసీపీ అభ్యర్థి లక్ష్మికి అనుకూలంగా 14 ఓట్లు పడ్డాయి. ముగ్గురు సభ్యులు గైర్హాజరయ్యారు.

ఏలూరులో రెండు స్థానాలు టీడీపీకే

ఏలూరు డిప్యూటీ మేయర్ల ఎన్నిక ఏకగ్రీవమైంది. వీటిని తెదేపా కైవసం చేసుకుంది. మొదటి డిప్యూటీ మేయర్‌గా ఉమామహేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండో డిప్యూటీ మేయర్‌గా దుర్గాభవాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు.

నెల్లూరులో..

నెల్లూరు డిప్యూటీ మేయర్‌గా టీడీపీ మద్దతు అభ్యర్థి తహసీన్ ఎన్నికయ్యారు. 29 ఓట్ల మెజారిటీతో ఆమె ఎన్నికయ్యారు. ఆమె 41 ఓట్లు, వైకాపా అభ్యర్థి కరీముల్లాకు 12 ఓట్లు వచ్చాయి. తహసీన్ గెలిచినట్లు అధికారులు ప్రకటించారు. ఆమెకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి నారాయణ ఆలోచనతో మైనార్టీ అభ్యర్థిని పెట్టారని.. తాను బలపరిచినట్లు చెప్పారు. తహసీన్ ఎన్నికకు సహకరించిన కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ, మంత్రి ఆలోచనలను తెదేపా అదిష్ఠానం ఆమోదించిందన్నారు. ఈ గెలుపుతో నెల్లూరు నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు బహుమానం ఇచ్చామని పేర్కొన్నారు.

అలా అయితే పులివెందులకు ఉప ఎన్నిక తప్పదు.. జగన్‌పై రఘురామ సెటైర్లు

విశ్వంభర, అమరావతిః అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా అడగడంపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు తీవ్రంగా మండిపడ్డారు. ప్రతిపక్ష హోదాను స్పీకర్, సీఎం ఇవ్వరని.. ప్రజలు ఇవ్వాలని తెలిపారు. సోమవారం నాడు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఎవరైనా 60 రోజుల పాటు లీవ్ అడగకుండా సభకు రాకుంటే.. అనర్హత వేటు పడుతుందని తెలిపారు. ఒకవేళ జగన్ అసెంబ్లీకి రాకపోతే పులివెందులకు ఉప ఎన్నిక వస్తుందని స్పష్టం చేశారు.జగన్ అసెంబ్లీకి రావాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని రఘురామ కృష్ణరాజు అన్నారు. ఆయన అసెంబ్లీకి వచ్చి తన మనోభావాలు పంచుకోవాలని కోరారు. తన కస్టోడియల్ టార్చర్ కేసులో సునీల్‌కుమార్ పాత్ర స్పష్టమైందని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నానని పేర్కొన్నారు. తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని. దోషులకు శిక్షపడుతుందనే నమ్మకం ఉందని చెప్పారు.కస్టోడియల్ టార్చర్ కేసులో గతంలో ఎన్నో ఫిర్యాదులు చేశానని రఘురామ తెలిపారు. సమాజాన్ని మతాలు, కులాల వారీగా విడగొట్టేవిధంగా మాట్లాడారని మండిపడ్డారు. కానీ సునీల్‌కుమార్ అతి తెలివితేటలు ఉపయోగించి యూట్యూబ్‌లో ఉన్న వీడియోలను తీసేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి తానొక బాధితుడిగా ఫిర్యాదు చేశానని అన్నారు. కస్టోడియల్ టార్చర్ కేసులో తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

ప్రపంచ దేశాల్లో భారత్ పేరు మార్మోగుతోంది

సీఎం చంద్రబాబు

ఢిల్లీ: భారత్ అభివృద్ధిని ప్రపంచదేశాలు గమనిస్తున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఇటీవల దావోస్ పర్యటనలోనూ దీన్ని గమనించానని చెప్పారు. గతంలో ఐటీపై, ఇప్పుడు ఏఐపై దృష్టి పెరిగిందన్నారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐ సాంకేతికతలో భారత్ ముందుందని చెప్పారు. ప్రపంచ దేశాల్లో మన దేశం పేరు మార్మోగుతోందన్నారు. ''2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలుస్తుంది. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. పన్ను సంస్కరణల్లో చాలా మార్పులు జరిగాయి. విద్యుత్ రంగంలో సంస్కరణలు ప్రథమంగా ఏపీలోనే జరిగాయి. ఎంఎస్ఎంఈ పాలసీ గేమ్‌ఛేంజర్‌గా మారబోతోంది. దేశంలో పెట్టుబడులకు చాలా మంది ముందుకొస్తున్నారు. పలు రంగాల్లో భారీగా పెట్టుబడులు రాబోతున్నాయి. నూతన ఆవిష్కరణలతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పెరుగుతోంది. వృద్ధిరేటు పెంచేలా ఈ బడ్జెట్ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్యవేత్తల్లో భారతీయులే ప్రముఖంగా ఉంటున్నారు.

సమ్మిళిత వృద్ధితోనే అభివృద్ధి సాధ్యం. ఎవరికి ఓట్లు వేస్తే మంచి జరుగుతుందో ఆలోచించాలి. ఢిల్లీలో వాతావరణ కాలుష్యంతో పాటు రాజకీయ కాలుష్యం కూడా ఉంది. అభివృద్ధికి ఢిల్లీ ఆమడ దూరంలో ఆగిపోయింది. సమస్యల వలయంలో చిక్కుకుంది. అభివృద్ధి కావాలంటే భాజపాకు ఓట్లు వేయాలి. ఢిల్లీలో బీజేపీ గెలుపు.. దేశ ప్రగతికి మలుపు. సంపద దోచుకునేవాళ్లు కాదు.. పంచేవాళ్లు కావాలి. విభజనతోనే కాదు.. గత ప్రభుత్వ విధ్వంస విధానాలతో ఏపీ పూర్తిగా దెబ్బతింది. విధ్వంసంతో దెబ్బతిన్న రాష్ట్రానికి చేయూతనివ్వాలని కేంద్రాన్ని కోరుతున్నా. మన పరిపాలన బాగుంటే కేంద్రం చేయూత ఇస్తుంది. అప్పుడు ఏపీ అభివృద్ధి పరుగులు తీస్తుంది. అన్ని రంగాల్లో జరిగిన విధ్వంసాన్ని ఇప్పుడిప్పుడే చక్కదిద్దుతున్నాం. ఇప్పుడిప్పుడే అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నాం'' అని చంద్రబాబు అన్నారు.

పేరు ప్రస్తావిస్తేనే నిధులు వచ్చినట్లా?

కేంద్ర బడ్జెట్‌లో ఏపీ పేరు ప్రస్తావించలేదన్న విమర్శలపై సీఎం స్పందించారు. పేరు ప్రస్తావించనంత మాత్రాన రాష్ట్రానికి నిధులు రానట్లు కాదన్నారు. కొన్ని పథకాలకు ఎప్పటిలాగే నిధులు కేటాయించారని చెప్పారు. ''కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన పథకాల నిధులను గరిష్ఠంగా ఉపయోగించుకునే అవకాశం ఏపీకే ఉంది. ఈ మేరకు ఇదివరకే మేం ఆయా రంగాల్లో పాలసీలు తీసుకొచ్చాం. విభజన కన్నా వైకాపా పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది. ఈ రెండు అంశాలను ఆర్థిక సంఘానికి వివరించి నిధులు కోరతాం'' అని చంద్రబాబు తెలిపారు.

సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు ఏకగ్రీవం

విశ్వంభర, అమరావతిః సీపీఎం ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు మళ్లీ ఎన్నికయ్యారు. నెల్లూరులో జరిగిన 27వ ఏపీ రాష్ట్ర మహాసభల్లో భాగంగా.. సోమవారం నాడు నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావును మరోసారి రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15 మంది రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులతో కలిసి మొత్తం 50 మందిని ఈ సందర్భంగా ఎన్నుకున్నారు. ఏడురుగు ఆహ్వానితులు, ఐదుగురు ప్రత్యేక ఆహ్వానితులతో కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా వెంకటేశ్వరరావు, బాబురావు, ప్రభాకర్ రెడ్డి, రమాదేవి, తులసీదాస్, వెంకటేశ్వర్లు, లోకనాథం, సురేంద్ర, సుబ్బరావమ్మ, రాంభూపాల్, ఉమామహేశ్వరరావు, బలరాం, మూలం రమేశ్, ఏవీ నాగేశ్వరరావును ఎంపిక చేశారు.

శ్రీనివాసరావు ప్రస్థానమిదీ..!

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన వంకాయలపాటి శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం కెల్లంపల్లిలో ఓ సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. 1960లో జన్మించిన ఆయన.. ప్రకాశం జిల్లాలోనే ప్రాథమిక, ఉన్నత విద్యను అభ్యసించారు. 1974-76లో నెల్లూరు జవహర్ భారతి కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. డిగ్రీ చదివే సమయంలోనే ఆయన ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. మొదటి సంవత్సరంలోనే విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశారు. 1978-79లో ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1979 నుంచి 1982 వరకు కార్యదర్శిగానూ పనిచేస్తూ న్యాయ విద్యలో చేరారు. 1982-84లో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తూనే రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పలు రాష్ట్రస్థాయి ఆందోళనల్లో పాల్గొన్నారు.1985లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1992లో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. 2000లో ప్రజాశక్తి పత్రిక సంపాదకుడిగా పనిచేశారు. 2005లో కేంద్ర కమిటీ సభ్యుడిగా, అనంతరం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. దళిత శోషణ్ ముక్తి మంచ్ వ్యవస్థాపక కన్వీనర్, జాతీయ కార్యదర్శిగా వ్యవహరించారు.

ట్రంప్ టారిఫ్ వార్.. ఆందోళన లేదన్న నిర్మలమ్మ

ఢిల్లీః ముందునుంచి హెచ్చరిస్తున్నట్టుగానే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మెక్సికో, కెనడా, చైనా పైనా సుంకాల కొరడా ఝుళిపించారు. అలాగే ఇప్పటికే పలుమార్లు భారత్‌ను టారిఫ్ కింగ్ అని విమర్శించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో భారత్ ఆందోళన చెందుతుందా..? అని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ప్రశ్న ఎదురైంది. దీనికి ఆమె బదులిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.''దీనిపై ఎలాంటి ఆందోళన చెందడం లేదు. భారత్ తయారీ కేంద్రంగా ఉండాలని మేం కోరుకుంటున్నాం. మా సేవల రంగంలో బలంగా ఉన్నాం. సాఫ్ట్‌వేర్, ఏఐ, స్టెమ్ ఆధారిత పరిశోధనల పరంగా భారత్ స్వదేశీ సామర్థ్యం కలిగిఉంది. మన బలాలేంటో మనకు తెలుసు. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం ఉంది. భారత్‌లో అందుబాటులో లేని కొన్ని ఉత్పత్తులను మనం దిగుమతి చేసుకోవాలి. అలాంటి వాటిపై అధిక సుంకం విధించి, భారత్‌లోకి రాకుండా ఆపడం వల్ల ఏ ప్రయోజనం లేదు. ఉత్పత్తి, తయారీ, ఎంస్ఎంఈలకు సంబంధించి భారత్ ప్రయోజనాలను దృష్టిలోఉంచుకొని, సమతుల్యత పాటించాల్సిన అవసరం ఉంది'' అని మంత్రి వెల్లడించారు. ట్రంప్ వాణిజ్య యుద్ధ ప్రభావం భారత్‌పై ఎలా ఉండనుంది..? అనే ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. ''ఆ టారిఫ్‌ల ప్రభావం పరోక్షంగా మనపైనా ఉండొచ్చు. అయితే అది ఏ స్థాయిలో ఉండనుందనేది ప్రస్తుతానికి అంచనా వేయలేం. మేం మాత్రం అత్యంత అప్రమత్తతతో పరిస్థితులను గమనిస్తున్నాం'' అని తెలిపారు. దీర్ఘకాలిక మిత్రదేశాలైన కెనడా, మెక్సికోల నుంచి తాము దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25% చొప్పున, చైనా నుంచి వచ్చే అన్ని ఉత్పత్తులపై 10% సుంకం విధిస్తూ తాజాగా కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు.తాము చేసిన సాయానికి ప్రతిఫలం ఇదా అని కెనడా వాపోగా, తాజా పరిణామాల వేళ తాము తలవంచబోమని మెక్సికో తేల్చిచెప్పింది. ట్రంప్ చర్యలపై మండిపడిన చైనా.. డబ్ల్యూటీవోలో సవాలు చేస్తామని ప్రకటించింది. ఇతర దేశాలను సుంకాలతో ప్రతిసారీ బెదిరించకుండా, ఫెంటానిల్ లాంటి సమస్యలను సొంతంగా పరిష్కరించుకోవాలని అమెరికాకు చైనా హితవు పలికింది.

మణిపుర్ హింసపై సీఎం ఆడియోలు

ఫోరెన్సిక్ నివేదిక కోరిన సుప్రీం

ఢిల్లీ: జాతుల మధ్య వైరంతో ఈశాన్య రాష్ట్రం మణిపుర్ రగిలిపోతోంది. హింసను ప్రేరేపించడం వెనక ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ హస్తం ఉందంటూ ఆరోపణలు వచ్చాయి. దీనికి సంబంధించి ఆడియోలు కూడా లీక్ అయ్యాయి. ఈ ఆడియో క్లిప్‌కు సంబంధించి ప్రభుత్వ ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను అందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌కు సంబంధించి కొన్ని ఆడియోలు లీక్ అయ్యాయి. దీంతో రాష్ట్రంలో హింసను ప్రేరేపించారని ఆరోపిస్తూ.. కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్టు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై న్యాయస్థానం తాజాగా విచారణ చేపట్టింది. ఆడియో క్లిప్‌లను దేశంలోని స్వతంత్ర ఫోరెన్సిక్ ల్యాబ్ అయిన 'ట్రూత్ ల్యాబ్స్' పరిశీలించిందని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. అందులోని వాయిస్.. సీఎం గొంతుతో 93 శాతం మ్యాచ్ అయినట్లు తేల్చిందన్నారు. వాదనలు విన్న అనంతరం.. ఈ ఆడియోలకు సంబంధించి ఫోరెన్సిక్ రిపోర్ట్‌ను అందించాలంటూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రభుత్వ ఫోరెన్సిక్ లాబొరేటరీ సీఎఫ్ఎస్ఎల్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశంపై తదుపరి విచారణను మార్చి 24కు వాయిదా వేసింది. కాగా.. జాతుల మధ్య వైరంతో ఏడాదిన్నరకాలంగా మణిపుర్ అట్టుడుకుతోంది. హింస కారణంగా ఇప్పటివరకు 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ హింసను నిలువరించేందుకు ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే హింసను ప్రేరేపించారంటూ సీఎం బీరేన్‌సింగ్‌పై ఆరోపణలు గుప్పుమన్నాయి.

ఘనంగా అనంత్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రారంభం

విశ్వంభర, హైదరాబాద్ : అనంత్ డైమండ్స్ తెలంగాణ ఫ్లాగ్‌షిప్ షోరూమ్‌ను మార్గదర్శి మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్ శైలజా కిరణ్, హ్యాండ్లూమ్ & టెక్‌స్‌టైల్ AP కమీషనర్ రేఖా రాణి తోపాటు అనంత్ డైమండ్స్ అధినేత వెంకట భాను ప్రకాష్, విష్ణు ప్రియ కలసి రోడ్ నెం.46A, జూబ్లీహిల్స్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా శైలజ కిరణ్ మాట్లాడుతూ.. కష్టపడే తత్వం ఉంటే ఏ రంగంలోనైనా రాణించగలరని అన్నారు. హార్డ్ వర్క్ చేయడం ద్వారానే భాను ప్రకాష్ విష్ణుప్రియ డైమండ్ రంగంలో రాణిస్తున్నారని ఆమె ప్రస్తావించారు. 13 సంవత్సరాల క్రితం విజయవాడలో తొలి బ్రాంచ్ ప్రారంభించి, అక్కడ నుంచి అంచలంచలాగా ఎదుగుతూ ఇవాళ హైదరాబాదులో బ్రాంచ్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. వాళ్ళకంటూ ఒక ప్రత్యేకమైన డిజైన్తో మంచి నాణ్యమైన ఆభరణాలను అందిస్తూ ఈ రంగంలో రాణించడం అభినందనీయం అని పేర్కొన్నారు. అనంతరం రేఖ రాణి మాట్లాడారు. అనంత్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో అధునాతన క్రియేషన్స్ ఇది కొత్త తరం ఆధునిక వధువుల కోసం గోల్డ్, డైమండ్స్‌లో మనకి అనుగుణంగా తయారు చేయబడతాయి, ప్రతి రాయి యొక్క ఆకృతిని అనుభవజ్ఞులైన చేతితో జాగ్రత్తగా అధ్యయనం చేసి ఉత్తమ గ్రేడ్ ఏ వజ్రాలను ఎంచుకొని మన అభిరుచికి అదునుగా డిజైన్ చేసి ఇవ్వడం లో అనంత డైమండ్స్ ప్రత్యేకం అని తెలిపారు. వెంకట భాను ప్రకాష్ మాట్లాడుతూ.. విజయవాడలో పదమూడు సంవత్సరాలు మా అనుభవం తో ఇపుడు హైదరాబాద్‌లో మా షోరూం అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మీరు కట్, క్లారిటీ, కలర్ మరియు క్యారెట్ సైన్స్‌లో పాజ్ లో ఈ రాళ్లను ఒక అద్భుతమైన కళాఖండంగా, మిరుమిట్లు గొలిపే విధానంలో పొందుపరిచిన అద్భుతమైన కళాత్మకతను పరిశీలించండి అని తెలిపారు.

కుంభమేళా తొక్కిసలాట ఘటనపై నిరసనలు.. స్పీకర్ ఆగ్రహం

ఢిల్లీ: కుంభమేళాలో మౌని అమావాస్య రోజున జరిగిన తొక్కిసలాటలో 30 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనను పార్లమెంట్ లో విపక్షాలు లేవనెత్తాయి. సోమవారం ఉభయ సభలు ప్రారంభం అయిన వెంటనే పెద్దఎత్తున నిరసనలు చేపట్టడంతో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనను లోక్‌సభ స్పీకర్ తీవ్రంగా ఖండించారు. పన్ను చెల్లింపుదారుల డబ్బును వృథా చేయొద్దని, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రశ్నోత్తరాల సమయం తర్వాత ఆ ఘటన గురించి ప్రస్తావించాలని స్పీకర్ ఆదేశించినప్పటికీ.. నినాదాలు ఆగలేదు. ఈ పరిస్థితుల మధ్యే లోక్‌సభ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి .''ఇక్కడ టేబుల్స్ విరగ్గొట్టేందుకు ప్రజలు మిమ్మల్ని గెలిపించలేదు. మీరు బల్లలు పగలగొట్టడానికే ఇక్కడికి వచ్చి-ఉంటే.. వాటిని ఇంకా గట్టిగా కొట్టండి'' అని విపక్ష ఎంపీలకు స్పీకర్ చురకలు అంటించారు. మరోవైపు రాజ్యసభలో కూడా నిరసనలు వినిపించాయి. తర్వాత విపక్ష ఎంపీలు ఎగువ సభ నుంచి వాకౌట్ చేశారు. ఇదిలాఉంటే.. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం చర్చ ప్రారంభమైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ఈ అంశంపై ప్రసంగించనున్నారు. ప్రధాని మోదీ మంగళవారం మాట్లాడనున్నారు.